బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టులు సరికాదు

ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

మోటకొండూర్, జూన్ 6: కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని, పార్టీ నాయకులను అరెస్టు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అభివృద్ధి చేసే సోయి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, ప్రజావ్యతిరేఖ పాలన రాష్ట్రంలో కొనసాగుతుందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై పోరాడే బీఆర్ఎస్ పార్టీ నాయకులను ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు గురిచేస్తుందని, రానున్న కాలంలో బీఆర్ఎస్ పాలనేనని ధీమా వ్యక్తం చేశారు. ఆలేరు నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులు శంకుస్థాపనలకే పరిమితం కాకుండా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఎగ్గిడి కృష్ణ, బాల్ద లింగం, పన్నాల అంజిరెడ్డి, భూమండ్ల యాదయ్య, సిరబోయిన నర్సింహులు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సిగ్గుచేటు

సర్పంచుల సంఘం రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్

సంస్థాన్ నారాయణపురం, జూన్ 6: సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన అసమర్థ పాలన అని సర్పంచుల సంఘం రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ తీవ్రంగా విమర్శించారు. యాదాద్రి జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో నారాయణపురం మండలంలోని

వల్దాస్ రాజ్‌కాలభైరవ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

తాజా మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్య గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచులు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేశారని బిల్లులు చెల్లించమని కోరితే అక్రమంగా అరెస్టులు చేసి కేసులు నమోదు చేస్తున్నారని వాపోయారు. సీఎం రేవంత్ రెడ్డి ఏ జిల్లా పర్యటనకు వెళితే ఆ జిల్లాలో సర్పంచులను మందస్తుగా అరెస్టు చేయడం పరిపాటిగా మారిందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం కాంట్రాక్టర్లకు విడుదల చేసి అవి సర్పంచుల పెండింగ్ బిల్లులు విడుదల చేసామని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ నర్రి నరసింహ, మాజీ సర్పంచులు జక్కర్తి పాపయ్య, దోనూరు శేఖర్‌రెడ్డి, యాదవరెడ్డి, మాన్నె చిత్ర చిన్నారెడ్డి, పాండురంగ నాయక్, కట్టెల భిక్షపతి, గ్రామ శాఖ అధ్యక్షులు తెలంగాణ భిక్షం, సిద్దగొని శీను ఉన్నారు.

మాట్లాడుతున్న సునీతామహేందర్‌రెడ్డి

నిర్బంధ పాలనకు బుద్ధి చెపుతారు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 6 : రాష్ట్రంలో కొనసాగుతున్న నిర్బంధ పాలనకు ప్రజలు తగిన బుద్ధి చెపుతారని మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, మాజీ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్యలు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనలో భాగంగా శుక్రవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో సార్లు జిల్లా పర్యటనకు వచ్చారని గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ పరిపాలన దుర్మార్గంగా కొనసాగుతుందన్నారు. అధికారంలోకి వచ్చి రెండేండ్లు కావస్తున్నా ప్రజలకు

కిరణ్‌కుమార్‌ను అరెస్టు చేసిన ఎస్సై కుమారస్వామి

ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలు కాంగ్రెస్ పాలనపై అసంతృప్తితో ఉన్నారన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో అవిశెట్టి పాండుయాదవ్, మల్లెబోయిన బాలనర్సిహ్మ, వల్దాస్ రాజ్‌కాలభైరవ తదితరులున్నారు.

ముందస్తు అరెస్టులు ఖండిస్తున్నం

భువనగిరి అర్బన్, జూన్ 6: బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు అరెస్టు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ భువనగిరి పట్టణ అధ్యక్షుడు ఏవీ.కిరణ్‌కుమార్ హెచ్చరించారు. సీఎం పర్యటనలో భాగంగా శుక్రవారం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఏవీ.కిరణ్‌కుమార్‌ను పట్టణ ఎస్సై కుమారస్వామి అరెస్టు చేసి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తూ కాలం వెళ్లదీస్తుందని అన్నారు. హామీలు అమలు చేసే సోయిలేదు కానీ ప్రారంభాలు, పర్యటనలపై ఆర్భాటాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయించడం సిగ్గుచేటన్నారు.

హైదరాబాద్‌లో ఉన్నా అరెస్ట్‌లు తప్పలే..

ఆత్మకూరు(ఎం), జూన్ 6 : హైదరాబాద్‌లో ఉన్నా ముందస్తు అరెస్ట్‌లు తప్పలే ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా హైదరాబాద్‌లో ఉన్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు లగ్గాని రమేశ్‌గౌడ్, మొరిపిరాల మాజీ సర్పంచ్ సామ తిరుమల్‌రెడ్డిని శుక్రవారం ముందస్తు అరెస్ట్ చేసి మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రాజాపేటలో..

రాజాపేట, జూన్ 6 : సీఎం సభ సందర్భంగా శుక్రవారం మండల బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన నాయకులు సట్టు తిరుమలేశ్, చింతలపూడి వెంకటరామిరెడ్డి, గుంటి మధుసూదన్ రెడ్డి, పల్లె ప్రవీణ్ కుమార్‌గౌడ్, ఎర్ర గోకుల జస్వంత్, యమ్మ భాస్కర్, గోపిరెడ్డి కనకయ్య కర్ణాకర్, మోత్కుపల్లి బాలకృష్ణ తదితరులున్నారు.

వలిగొండలో..

వలిగొండ, జూన్ 6: సీఎం పర్యటన సందర్భంగా మండలంలోని

బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

వర్కట్‌పల్లి, గోకారం గ్రామాల్లోని త్రిబుల్ ఆర్ బాధితులతోపాటు సీపీఎం పార్టీ నాయకులను శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేసినట్లు ఎస్సై యుగంధర్ తెలిపారు.

బొమ్మలరామారంలో..

బొమ్మలరామారం, జూన్ 6 : పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ సీఎం సభను అడ్డుకోవడానికి వెళుతున్న మండల సర్పంచుల ఫోరం సభ్యులను పోలీసులు మాజీ సర్పంచులను ముందుస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర నాయకులు మేడబోయిన గణేశ్, పూడూరి నవిన్‌గౌడ్, శ్రీనునాయక్, నూకల రాంరెడ్డి, బట్కీర్ బీరప్ప, సుర్వి గోవింద్ గౌడ్, రామిడి ప్రభాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎం సభకు ఉద్యోగులు..

మూతపడ్డ మండల సమాఖ్య భవనం

ఆత్మకూరు(ఎం), జూన్ 6 : ఉద్యోగులందరూ సీఎం సభకు వెళ్లడంతో మండల సమాఖ్య భవనం మూతపడింది. తుర్కపల్లిలో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు శుక్రవారం మండల సమాఖ్య కార్యాలయ ఉద్యోగులు మండలంలోని అన్ని గ్రామాల నుంచి మహిళా సంఘాల సభ్యులను తీసుకుని వెళ్లారు. దీంతో కార్యాలయంలో ఎవ్వరూ లేకపోవడంతో తాళం వేసి ఉంది.

నాల్గో రోజూ భూ భారతి రెవెన్యూ సదస్సు

వలిగొండ, జూన్ 6: మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు నాలుగవ రోజూ కొనసాగాయి. శుక్రవారం మండలంలోని పుల్లిగిల్ల, గోపరాజుపల్లి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ దశరథ, డిప్యూటీ తహసీల్దార్ పల్లవి, రెవెన్యూ అధికారులు మనోహర్, కరుణాకర్‌రెడ్డి, నగేష్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి

సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ జ్యోతి

మోత్కూరు, జూన్ 6 : భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని మండల తహసీల్దార్ జ్యోతి అన్నారు. శుక్రవారం బుజిలాపురంలో అధికారులు రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరిస్తామని అన్నారు. ఉప తహసీల్దార్ ఉపేందర్, సుమన్, శ్రీనువాస్, కృష్ణ, ఇంద్రకుమార్, ఖాజ ఫరుద్దీన్ పాల్గొన్నారు.

బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ

సూర్యాపేటటౌన్, జూన్ 6: బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలోని ముస్లిం సోదరులకు జిల్లా ఎస్పీ నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పరిధిలోని ఈద్గాలు, మసీద్‌ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఇతరులను కించపరిచేలా పోస్టులు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

గరిడేపల్లి, జూన్ 6: బక్రీద్ పండుగను సోదరభావంతో, కులమతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్సై చలికంటి నరేశ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాను వేదికగా విభేదాలు సృష్టించే వీడియోలు, ఫొటోస్ పెడితే కఠినమైన చర్యలు తప్పవన్నారు.

సమ్మె జయప్రదం చేయండి

మేళ్లచెర్వు, జూన్ 6: దేశవ్యాప్తంగా ఈ నెల 9న జరుగనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వట్టిపు సైదులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనం చెల్లించాలన్నారు. అశోక్, రాములు, జానీ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూర్.ఎస్, జూన్ 6: మండల పరిధిలోని ఏపూరులో గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు మిసన్ శిక్షణ కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి లింగయ్య ప్రారంభించి మాట్లాడారు. నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్‌తో పాటు సబ్సిడీలో కుట్టు మిషన్ ఇస్తున్నారన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ స్వరాజ్య సంస్థ మండల కో-ఆర్డినేటర్ షేక్ నజీమా, మాజీ సర్పంచి రజితసుధాకర్, మాజీ ఎంపీటీసీ మంజులశ్రీనివాస్, లింగయ్య, మహిళలు పాల్గొన్నారు.

గుట్ట బస్సులన్నీ సీఎం సభకే..

అవస్థలు పడ్డ ప్రయాణికులు

రాజాపేట, జూన్ 6 : సీఎం సభకు యాదగిరిగుట్ట డిపో ఆర్టీసీ బస్సులు కేటాయించడంతో గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం నిలిచిపోయింది. దాంతో ప్రయాణికులు వివిధ గ్రామాలకు వెళ్లడానికి అవస్థలు పడ్డారు. ఆటోలు సైతం లేకపోవడంతో కాలినడకే దిక్కయింది. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తమ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. రాజాపేట మండలానికి నిత్యం యాదగిరిగుట్ట డిపో నుంచి బస్సుల సౌకర్యం ఉండేది. ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూసినా ఒక్క బస్సు కూడా రాక పోవడంతో ఆవేదనకు గురైయ్యారు. ఇక్కడి నుంచి నిత్యం యాదగిరిగుట్ట, భువనగిరి, హైదరాబాదుకు వ్యాపారులు ప్రయాణికులు వెళ్తుండేవారు. సీఎం సభకు బస్సులన్నీ కేటాయించడంతో ప్రయాణికులు, వ్యాపారులు బస్సు సౌకర్యం లేక మండిపడ్డారు.

ధాన్యంతోనే మానసిక ప్రశాంతత

ధ్యానర్షి మెగా మురళి

ఆలయంలో వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

భువనగిరికలెక్టరేట్, జూన్ 6 : ధాన్యంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రతి ఒక్కరూ శ్వాసపై ధ్యాసను ఉంచాలని ధ్యానర్షి మెగా మురళి సూచించారు. మండలంలోని గంగసానిపల్లి గ్రామ సమీపంలోని ధ్యాన సాయిబాబా ఆలయ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిత్యం ధాన్యం చేయడం, శ్వాసపై ధ్యాసను పెంపొందించడం వల్ల మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందన్నారు. దైవ చింతనను అలవర్చుకుని రానున్న సమాజానికి స్ఫూర్తిగా నిలవాలన్నారు.

ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి

మద్దిరాల, జూన్ 6 : రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డీఏ విడుదల చేసి రెండు డీఏలు ఇచ్చినట్టు ప్రకటించడం ముమ్మాటికి ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేసినట్లేనని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రేపాక లింగయ్య అన్నారు. ఆయన మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ సంవత్సరం నుంచి అందక నిరీక్షిస్తున్న ఉద్యోగులు అనేక మంది ఉన్నారన్నారు. ప్రభుత్వం మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

మా జోలికొస్తే ఊరుకోం..

ప్రభుత్వ మాజీ విప్ సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, జూన్ 6: రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ యాదగిరిగుట్టకు వచ్చిన సందర్భంలో ఎలాంటి నిర్బంధాలు పెట్టలేదు. ఏ ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకులను అరెస్టు చేసిన దఖలాలు లేవు. సీఎం రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్టకు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను అరెస్టు చేశారు. తిరుమలాపూర్ గ్రామంలో ముఖ్యమంత్రి పెట్టిన సభతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు వస్తే అక్రమంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను ముందస్తుగా అరెస్టు చేసి రోజంతా పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. ప్రజల మధ్యకు వెళ్లితే నిలదీస్తారని, ప్రశ్నిస్తారని అడ్డుకుంటారని సభ కార్యక్రమాన్ని నిర్వహించిన్నట్లుగా కనిపించింది. ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా జిల్లా మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీకి వెన్నులో వణుకు పుట్టిన్నట్టుగా ఉంది. అందుకే ఎక్కడికక్కడ పార్టీ నాయకులను అరెస్టు చేశారు. తుర్కపల్లి మండలంలోని తిరుమలా పూర్‌లో సభ జరిగితే చిట్యాల, రామన్నపేట మండలాల్లో అరెస్టులు కొనసాగాయి. బీఆర్ఎస్ పార్టీ నాయకులను నిర్బంధిస్తూ కార్యక్రమాన్ని చేపట్టారు. మా ప్రభుత్వంలో ప్రతిపక్షాలను అరెస్టులు చేయబోం. ప్రతిపక్ష పార్టీలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తాం. వారు ప్రశ్నించోచ్చు అని మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు అరెస్టుల పర్వాన్ని తెర తీశారో చెప్పాలి. కాంగ్రెస్ పార్టీకి ప్రజలపై ఉన్న నమ్మకం పోయింది. త్వరలో ప్రజల నుంచే తిరుగుబాటు తప్పదు. పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను అరెస్టు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఏ కార్యక్రమాన్ని చేసిన న్యాయం, ధర్మంగా ప్రజల పక్షాన నిలబడి చేస్తుంది. దొంగదెబ్బ తీయడం బీఆర్ఎస్ పార్టీకి అలవాటు లేదు. అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్న పోలీసులను హెచ్చరిస్తున్నాం. బీఆర్ఎస్ పార్టీ నాయకులను పనికి వెళ్లకుండా అడ్డుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తే సహించేదిలేదు.

ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించాలి

భూదాన్‌పోచంపల్లి, జూన్ 6 : చెత్తను వీధుల వెంట వేయ కుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించాలని మున్సిపల్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోత్స్న అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రం వినోబామందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వంద రోజుల కార్యాచరణలో భాగంగా వృత్తి వ్యాపారాలు లైసెన్సు లేని షాపు యజమానుదారులకు లైసెన్సులు తీసుకోవాలని నోటీసులు జారీ చేశారు. మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ నిర్మల, వార్డు ఆఫీసర్లు, మెప్మా సిబ్బంది, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోత్స్న

అభివృద్ధి చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, జూన్ 6: ఆలేరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి చేతులు దులుపుకోకుండా ఆ పనులను చిత్తశుద్ధితో పూర్తి చేయాలన్నారు. ప్రజాపాలన అని చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష పార్టీ నాయకులను ఎందుకు ముందస్తు అరెస్టులు చేశారో చెప్పాలి. గ్రామాలలో ఎక్కడికక్కడ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచుల, పాడి రైతులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. తెల్లవారుజామూనే ఇంటికి వెళ్లి ఉన్నఫలంగా అరెస్టు చేయడం దేనికి నిదర్శనం. పదేళ్ల పాలనలో ఇంత దారుణమైన పరిస్థితులను చూడలేదు. యాదగిరిగుట్ట దేవస్థానానికి రాష్ట్ర తొలిసీఎం కేసీఆర్ 22 సార్లు వచ్చారు. ఏ ఒక్కరోజూ కూడా పట్టణంలో ఉన్న ఏ కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయలేదు. ప్రజాపాలన గొప్పలు చెబుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అప్రజాస్వామిక పాలనను సాగిస్తుంది. ఒక్కొక్క బస్సుకు ఇద్దరు కానిస్టేబుళ్లను పెట్టి రేవంత్‌రెడ్డి సభకు తరలించారు. జిల్లా కలెక్టర్ దీనిపై పునరాలోచన చేయాలి. ఎందుకు ఇంత భయం మీకు? రూ. 2500 ఎక్కడ పోయాయని, స్కూటీలు ఎక్కడపోయాయని, తులం బంగారం, రూ. 4 వేల పింఛన్లు ఇవ్వమని ప్రజలు ప్రశ్నిస్తారన్న భయం కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసుల్లో ఉందన్నారు. అధికారం శాశ్వతం కాదు. ఎప్పటికైనా రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం. ప్రజలంతా కేసీఆర్ వైపు చూస్తున్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి

భూదాన్‌పోచంపల్లి, జూన్ 6 : క్షయ వ్యాధి నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాలని మండల వైద్యాధికారి శ్రీవాణి అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధి నిర్మూలన, టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యాచరణలో భాగంగా ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో భాగంగా సంచార వాహన సేవలు ప్రారంభించారు. మండల పరిధిలో అనుమానిత క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారికి తెమడ, ఎక్స్‌రే, హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, టీబీ డీపీఎం సైదులు, టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, టీబీ మోడల్ పర్సన్ ఎంఏ బేగ్, ల్యాబ్ సూపర్‌వైజర్ అశ్విని, ఐసీటీసీ కౌన్సిలర్ సతీష్, ఐసీటీసీ

సంచార వాహన సేవలో పాల్గొన్న మండల వైద్యాధికారి శ్రీవాణి

ల్యాబ్ టెక్నీషియన్ నాగార్జున, మొబైల్ బ్యాంకింగ్ శ్రీకాంత్, రవికుమార్, ఆరోగ్య కార్యకర్తలు జానకి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలో నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీహరి అయ్యంగార్

పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న శ్రీహరి అయ్యంగార్

బొమ్మలరామారం,జూన్ 6 : బడులు పునః ప్రారంభం నాటికి ముందుగానే పాఠశాలల్లోని వంటశాల, టాయిలెట్, ఇంకుడుగుంత, మంచినీటి ట్యాంక్ నిర్మాణ పనులను అమ్మ ఆదర్శ కమిటీల సహకారంతో త్వరగా పూర్తి చేయాలని జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీహరి అయ్యంగార్ అన్నారు. మండలంలోని యావాపూర్‌లో ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. యావాపూర్, ఖాజీపేట గ్రామాల్లో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ దత్తత గ్రామం యావాపూర్‌లో పాఠశాలను అన్ని వసతులతో పునః ప్రారంభిస్తున్నందున గ్రామస్తులు తమ బడి ఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ఉపాధ్యాలు జయలక్ష్మి, రత్నకుమారి, షేక్ హజీ, సీఆర్పీ శ్రీహరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వలిగొండలో ..

వలిగొండ, జూన్ 6 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యార్థుల తల్లి దండ్రులు సహకరించాలని మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతోపాటు ఉత్తమ శిక్షణ అందిస్తామని, విద్యార్థుల తల్లి దండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలని కోరారు. ఉపాధ్యాయులు నాగేందర్, సైదారెడ్డి, శ్రీనివాస్, విజయనిర్మల, వెంకటేశ్వర్లు, స్వామి, లక్ష్మి, కవిత, చంద్రకళ, మల్లేశం, జిలాని, స్వామిరాజ్, వెంకటేశం, శివాజీ, లింగయ్య, శారద, నవీన్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో నమోదు సంఖ్య పెంచాలి

ఆత్మకూరు(ఎం), జూన్ 6: ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు సంఖ్య పెంచాలని ఎంఈవో మహదేవరెడ్డి అన్నారు. జయశంకర్‌సార్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో మాట్లాడారు. గ్రామాల్లోని బడిఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి శేఖర్, పాఠశాల హెచ్ఎం దయాకర్‌రెడ్డి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఈవో మహదేవరెడ్డి

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలి

ర్యాలీలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

భూదాన్‌పోచంపల్లి, జూన్ 6 : ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త విద్యార్థులను నమోదు చేసుకొని పాఠశాలలను బలోపేతం చేయాలని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా భూదాన్‌పోచంపల్లిలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని అన్నారు. పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ పుష్పలత, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు, ఏఏపీసీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు స్థానం కల్పించాలి

చౌటుప్పల్, జూన్ 6 : మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు స్థానం కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మాదిగలది అత్యధిక జనాభా కలిగిన సామాజిక వర్గ మన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటులో కూడా ఉద్యమం చేసి జైలుకు వెళ్లడంతో పాటు ఆత్మ బలిదానాలు కూడా చేసుకున్నది మాదిగ బిడ్డలేనని ఆయన పేర